# మియాట్‌లో 'కీళ్ల మార్పిడి' మ్యూజియం

## ప్రారంభించిన ఛైర్మన్ మల్లిక మోహన్‌దాస్




**మోకాలు మార్పిడి ప్రదర్శనలో ఏర్పాటుచేసిన పరికరాలను పరిశీలిస్తున్న మియాట్ నిర్వాహకులు**

**కోడంబాక్కం:** మోకాలు, తొంటి మార్పిడి శస్త్రచికిత్సలపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో చెన్నైలోని మియాట్ ఆసుపత్రి సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. 1970ల్లో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు ఉపయోగించి, ఉపయోగిస్తున్న మెటల్ పరికరాలతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటుచేశారు. ఆర్థోప్లాస్టీ మ్యూజియం పేరుతో ఏర్పాటైన ఈ మ్యూజియంను మియాట్ ఛైర్మన్ మల్లిక మోహన్‌దాస్ గురువారం సాయంత్రం ప్రారంభించారు. మియాట్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రఖ్యాత శస్త్రచికిత్స నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ వీఏ మోహన్‌దాస్, ఆయన కుమారుడు, తొంటి శస్త్రచికిత్స నిపుణులు పృథ్వీ మోహన్‌దాస్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బారీ డిరోసారియో తదితరుల సమక్షంలో కీళ్లమార్పిడి మ్యూజియం ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలను పంపిణీ చేస్తున్న డిప్యూయ్ జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ భారత, న్యూయార్క్ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మియాట్‌లో 30వేల కీళ్లమార్పిడి శస్త్రచికిత్సలు, 20వేల తొంటి శస్త్రచికిత్సలు, 10వేల మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తిచేసిన సందర్భాన్ని పూర్తి చేసుకుని గురువారం ఆసుపత్రిలో సంబరాలు జరుపుకున్నారు. మియాట్ వైద్యులు, నర్సుల, ఇతర సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ సంబరాల్లో డాక్టర్ మోహన్‌దాస్ ప్రసంగిస్తూ... మనిషిలో కదలిక అనేది చాలా ముఖ్యమని, మనలోని కదలిక ఎంతోమంది కదిలించగలదని పేర్కొన్నారు. కీళ్లమార్పిడి మ్యూజియం ఏర్పాటు మియాట్ చరిత్రలో గొప్ప అధ్యాయమని శ్లాఘించారు. 1975లో తాను కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నేర్చుకున్న సమయంలో వారంపాటు శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి వచ్చేదని, ఇప్పుడు మియాట్ వైద్యులు 30 నిమిషాల్లోనే శస్త్రచికిత్స చేయగలిగే స్థాయికి చేరుకున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కీళ్లమార్పిడి శస్త్రచికిత్సల కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని, వారందరికీ శస్త్రచికిత్సలపై అపోహలు పోగొట్టి, అవగాహన కల్పించేందుకు ఆర్థోప్లాస్టీ మ్యూజియం దోహదపడుతుందని మోహన్‌దాస్ పేర్కొన్నారు.